APTEL/25/A5250

మన రాజధాని

రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు సంపుటి -1 సంచిక -97 పేజీలు-4 మంగళవారం 20 అక్టోబర్ 2026 వెల4/-

విజయదశమి సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు బుధవారం సంచిక విలువడదు.. పునరదర్శనం గురువారం.

- ఎడిటర్

ఒక్క ఓటు కూడా చీలకూడదు..

విజయవాడలో వంగవీటి రాధాను గెలిపించుకుందాం: టీడీపీ ప్రకటన

- విజయవాడ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకు టీడీపీ పూర్తి మద్దతు
- సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించిన పార్టీ
- రాధాను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపు
- కులతత్వం రెచ్చగొట్టేవారికి బుద్ధి చెప్పాలని కోరిన టీడీపీ
- కూటమి గెలుపుతో విజయవాడను అభివృద్ధి చేస్తామని హామీ

.. వివరాలు 2లో

స్థానిక సంస్థల్లోనూ కూటమికి

జై కొట్టండి

సీఎం చంద్రబాబు పిలుపు

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు

.. వివరాలు 2లో

గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా
- ఈ పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి

రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు..

ఇదేం పైశాచిక ఆనందం?: చంద్రబాబు

- ఉండవల్లిలో చంద్రబాబు మీడియా సమావేశం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీపై చంద్రబాబు విమర్శలు
- మెగా డీఎస్సీని అడ్డుకోవాలని వందల సార్లు కోర్టుకెళ్లారని ఆగ్రహం
- 55 సేవలపై ప్రజల అభిప్రాయం తీసుకుని జవాబుదారీతనం పెంచామని వెల్లడి
- విధ్వంసంతో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామని ఉద్ఘాటన

.. వివరాలు 2లో

రోడ్డును దున్నేసినందుకు

సిగ్గుపడాలి

- పుల్లంపేట మండలంలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేశారని ఆరోపణ
- వైసీపీ నేతలే ట్రాక్టర్‌తో రోడ్డును తవ్వేశారన్న మంత్రి నారా లోకేశ్
- రూ.4.75 కోట్లతో నిర్మించిన రోడ్డు అని వెల్లడి
- ఇది కక్షపూరిత చర్య అని, ప్రజలపై దాడి అని తీవ్ర ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీసులకు విజ్ఞప్తి

.. వివరాలు 2లో

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి: పవన్ కల్యాణ్

.. వివరాలు 2లో

- తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన
- వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం
- నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరమన్న డిప్యూటీ సీఎం
- 'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం

అల్లూరి ఏజెన్సీలో 50 నుంచి 60 శాతం స్థానాల్లో పోటీ చేస్తాం



- అరకులో జరిగిన జనసేన పార్టీ సమావేశంలో నాగబాబు కీలక వ్యాఖ్యలు
- గిరిజన సమస్యల పరిష్కారంపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారన్న ఎమ్మెల్సీ
- పొత్తుల చర్చల నేపథ్యంలో నాగబాబు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం

.. వివరాలు 2లో

22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి: ఈసీకి వైసీపీ వినతి

- 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయాలని ఈసీని కోరిన వైసీపీ
- టీడీపీ దాడులతో నామినేషన్లు వేయలేకపోయామని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషనర్‌కు వీడియో ఆధారాలు అందజేత
- 488 వార్డుల్లో అభ్యర్థులు లేకుండా పోయారని ఫిర్యాదులో వెల్లడి
- కుప్పం చైర్మన్ అభ్యర్థి కిడ్నాప్ అయ్యారని, పలువురిపై దాడులు జరిగాయని ఆందోళన

.. వివరాలు 2లో

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు

20 రోజులుగా ముంబైలో మకాం, ఫుట్‌బాల్ మైదానం వద్ద రెక్కీ

- టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు.. ముగ్గురు నిందితుల అరెస్ట్
- రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు
- దాడికి 20 రోజుల ముందే ముంబైకి వచ్చి రెక్కీ నిర్వహించినట్లు వెల్లడి
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలపై పోలీసుల దర్యాప్తు

.. వివరాలు 2లో

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి

విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతన్నల శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. "ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ. 4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. "ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య" అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

ఒక్క ఓటు కూడా చీలకూడదు..

మొదటి పేజీ తరువాయి

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల నేపథ్యంలో, కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ అభ్యర్థిత్వంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి తెలుగుదేశం పార్టీ చెక్ పెట్టింది. రాధాకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తూ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. కొద్ది రోజులుగా రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది. కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంతసముద్రం-పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ. 4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం

స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండ

మొదటి పేజీ తరువాయి

సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

చెప్పాం.. చేస్తున్నాం.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు. రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్యస్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు. మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200-300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి: ఈసీకి వైసీపీ వినతి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని 22 పట్టణ స్థానిక సంస్థల్లో కొత్తగా నామినేషన్లు స్వీకరించాలని లేదా ఎన్నికలను వాయిదా వేయాలని వైసీపీ నేడు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) కోరింది. అధికార టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, నారాయణమూర్తి తదితరులు కమిషనర్‌ను కలిసి దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను, మూడు వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలు తమ నామినేషన్ పత్రాలను చించివేశారని, కొన్నిచోట్ల పోలీసులు వారికి సహకరించగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులే స్వయంగా పత్రాలను లాక్కున్నారని ఆరోపించారు. ఈ 22 పురపాలక సంఘాల్లో మొత్తం 809 వార్డులు/డివిజన్లు ఉండగా, కేవలం 321 చోట్ల మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగలిగారని వైసీపీ వివరించింది. మిగిలిన 488 చోట్ల తమ పార్టీ తరఫున అభ్యర్థులే లేకుండా చేశారని, 8 మున్సిపల్ ఛైర్మన్ పదవులకు కూడా నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపింది. మైదుకూరులో 19 నామినేషన్ పత్రాలను చించివేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం అక్కడ ఎన్నికలను వాయిదా వేసిందని, అదే తరహా చర్యలు ఈ 22 ప్రాంతాల్లోనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, అవినాశ్ రెడ్డిపై జరిగిన దాడులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు, కనిగిరిలో స్క్రూటినీ కేంద్రాల్లోనే నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. ప్రొద్దుటూరు, కుప్పంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, కుప్పంలో ఛైర్మన్ అభ్యర్థి విజయ్ కుమార్ అపహరణకు గురయ్యారని, ఆయన ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అపహరణకు గురైన అభ్యర్థులను వెంటనే కాపాడి, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని, హింసకు పాల్పడిన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ బీసీ సర్టిఫికెట్ల అంశాన్ని నిబంధనల ప్రకారం, ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా పరిశీలించాలని కోరారు. ఏకగ్రీవాలను ప్రకటించే ముందు బాధితులైన తమ అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

అల్లూరి ఏజెన్సీలో 50 నుంచి 60 శాతం స్థానాల్లో పోటీ చేస్తాం: నాగబాబు

మొదటి పేజీ తరువాయి

జనసేన పార్టీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్ కొణిదెల నాగబాబు రాబోయే ఎన్నికల సీట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని దాదాపు 50 నుంచి 60 శాతం సీట్లలో జనసేన పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అరకులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగబాబు, పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీకి అరకు ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయలతో పవన్ పునాదులు వేశారని గుర్తుచేశారు. గిరిజనుల పురోగతికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఏజెన్సీ ప్రాంతంలోని సీట్లపై నాగబాబు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ప్రకటనతో ఏజెన్సీలో సీట్ల పంపకాలపై జనసేన తన వైఖరిని పరోక్షంగా స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు: 20 రోజులుగా ముంబైలో మకాం,

మొదటి పేజీ తరువాయి

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. దాడికి దాదాపు 20 రోజుల ముందే నిందితులు ముంబైకి చేరుకొని, పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారం రోజుల క్రితం టైగర్ ష్రాఫ్ ఆడుకుంటున్న ఫుట్‌బాల్ మైదానం వద్దకు వెళ్లి రెక్కీ కూడా నిర్వహించినట్లు గుర్తించారు. అరెస్టయిన వారిలో హర్యానాకు చెందిన ఫుల్‌సింగ్ నరేశ్, రెహాన్ రషీద్దీన్‌తో పాటు ముంబైలో నివసిస్తున్న హృతిక్ అనే రాపిడో డ్రైవర్ ఉన్నారు. వీరిలో హృతిక్ బైక్ నడపగా, మిగిలిన ఇద్దరు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 11న వీరు ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసినట్లు కూడా విచారణలో వెల్లడైంది. కాల్పుల అనంతరం పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ముందుగా బైక్‌పై అంధేరీ రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడి నుంచి లోకల్ ట్రైన్‌లో కాందివలీకి చేరుకున్నారు. ఆ తర్వాత క్యాబ్ బుక్ చేసుకొని సూరత్‌కు పారిపోయారు. అక్కడి నుంచి కోటా వెళుతున్న పుణే-జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కగా, పక్కా సమాచారంతో కోటా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్ ప్రకారం, కేవలం 15 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసి నిందితులను పట్టుకున్నారు. తొలుత ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోవాలని నిందితులు పథకం రచించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. నిందితుల్లో ఒకడైన రెహాన్‌కు, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న అనిల్ పండిట్‌తో పరిచయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే, కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని ఇంకా గుర్తించాల్సి ఉంది. గత ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ ఫుట్‌బాల్ మైదానం నుంచి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ స్వల్ప గాయాలతో బయటపడగా, డ్రైవర్ సహా మరొకరు గాయపడ్డారు. నిందితులను కస్టడీలోకి తీసుకునేందుకు ముంబై పోలీసుల బృందం కోటాకు చేరుకుంది. దాడి వెనుక అసలు కారణాలు తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది.

పురుషుల జట్టు చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా

బీసీసీఐ కీలక నిర్ణయం..

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల జట్టు సెలక్షన్ కమిటీలో కీలక మార్పులు చేసింది. చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజాను నియమించగా, మాజీ క్రికెటర్ రమేశ్ పొవార్‌కు కమిటీలో చోటు కల్పించింది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి తప్పుకొన్న నేపథ్యంలో సెలక్షన్ కమిటీ కొత్త కూర్పును బీసీసీఐ ప్రకటించింది. బీసీసీఐ సోమవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం.. క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) రమేశ్ పొవార్ నియామకాన్ని ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపేలతో కూడిన సీఏసీ.. దరఖాస్తులను పరిశీలించి, బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. టెస్టు మ్యాచ్‌ల్లో ఆడిన మ్యాచ్‌ల సంఖ్య ఆధారంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి అధ్యక్షత వహించనున్నాడు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో శివ్ సుందర్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రాతో పాటు రమేశ్ పొవార్ సభ్యులుగా కొనసాగనున్నారు. రమేశ్ పొవార్ భారత జట్టు తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడాడు. ఆటగాడిగా కెరీర్ ముగిసిన తర్వాత కోచ్‌గా సేవలందించాడు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేయడంతో పాటు ముంబై, గుజరాత్ జట్లకు కోచింగ్ బాధ్యతలు నిర్వహించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గానూ పనిచేశాడు. పొవార్ కోచ్‌గా ఉన్న సమయంలో భారత మహిళల జట్టు ఆసియా కప్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించింది.

మరోవైపు, చీఫ్ సెలెక్టర్‌గా పనిచేసిన అజిత్ అగార్కర్ సేవలను బీసీసీఐ ప్రశంసించింది. 2023 జులైలో బాధ్యతలు చేపట్టిన అగార్కర్ పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు గెలిచిందని తెలిపింది. ఆసియా క్రీడల్లో వరుసగా రెండు స్వర్ణ పతకాలు సాధించిన విజయాల్లోనూ ఆయన పదవీకాలం కీలకంగా నిలిచింది.

పురుషుల జట్టు సెలక్షన్ కమిటీ సభ్యులు:
ప్రజ్ఞాన్ ఓజా – ఛైర్‌పర్సన్
శివ్ సుందర్ దాస్ – సభ్యుడు
ఆర్పీ సింగ్ – సభ్యుడు
అజయ్ రాత్రా – సభ్యుడు, రమేశ్ పొవార్ – సభ్యుడు

ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట షురూ..

షూటింగ్‌లో స్వర్ణం, రజతం

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. పోటీల తొలిరోజైన సోమవారం, భారత పారా షూటర్లు పతకాల వేట ప్రారంభించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత క్రీడాకారిణులు మోనా అగర్వాల్ స్వర్ణం, అవనీ లేఖరా రజతం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ గేమ్స్‌లో భారత్‌కు ఇవే తొలి పతకాలు కావడం విశేషం. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా గేమ్స్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల స్వల్ప తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ అవనీ లేఖరా వెనుకబడింది. అవనీ 249.6 పాయింట్లతో రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి 227.9 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకుంది. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో కూడా భారత షూటర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా అగర్వాల్ 629.1 పాయింట్లతో గేమ్స్ రికార్డు నెలకొల్పి అగ్రస్థానంలో నిలవగా, అవనీ లేఖరా 626.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజే రెండు పతకాలతో భారత్ ఈ మెగా ఈవెంట్‌లో తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది.

టీ20ల్లో షఫాలీ సరికొత్త చరిత్ర

కెప్టెన్ రికార్డునే బ్రేక్ చేసిన ఓపెనర్

భారత మహిళల క్రికెట్ జట్టు యువ ఓపెనర్ షఫాలీ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టి, టీమిండియాకు ఘన విజయాన్ని అందించింది. ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. రాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో షఫాలీ కేవలం 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సాయంతో 55 పరుగులు చేసింది. ఈ క్రమంలో మహిళల టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక 50కిపైగా స్కోర్లు చేసిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. 2026లో షఫాలీకి ఇది 9వ యాభైకి పైగా స్కోరు (ఒక సెంచరీ, ఎనిమిది హాఫ్ సెంచరీలు). ఇంతకుముందు ఈ రికార్డు భారత కెప్టెన్ స్మృతి మంధాన పేరిట ఉండేది. మంధాన 2024లో ఎనిమిది 50కిపైగా స్కోర్లు సాధించింది. తాజాగా తన కెప్టెన్ రికార్డునే షఫాలీ అధిగమించడం విశేషం. ఈ ఏడాది ఇప్పటివరకు 26 టీ20 మ్యాచ్‌లలో షఫాలీ మొత్తం 922 పరుగులు చేసింది. 103 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో స్మృతి మంధానతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన షఫాలీ, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఈ జోడీ తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయాన్ని ఖాయం చేసింది. షఫాలీ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని ఔటవగా, మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జింబాబ్వే, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే బ్యాటర్లు తడబడ్డారు. నికీ ప్రసాద్ 7 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా, మిగతా బౌలర్లు కూడా రాణించారు. జింబాబ్వే జట్టులో చిపో ముగేరి-తిరిపానో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ సిరీస్ విజయంతో, భారత మహిళల జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్మృతి మంధాన తన తొలి సిరీస్‌ను గెలుచుకున్నట్లయింది.

అంబానీల నవరాత్రి వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్‌గా ధోనీ..

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, అతని అర్ధాంగి సాక్షి.. అంబానీ కుటుంబం నిర్వహించిన నవరాత్రి వేడుకల్లో సందడి చేశారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ టౌన్‌షిప్‌లో నిన్న జరిగిన ఈ వేడుకల్లో అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌తో కలిసి ధోనీ దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్నివాల్‌లో ధోనీ, అనంత్ అంబానీ సరదాగా గడిపారు. ఇద్దరూ కలిసి డ్రాగన్ బోట్ వంటి ఫాస్ట్ రైడ్‌ను ఎంజాయ్ చేశారు. అభిమానులతో ముచ్చటిస్తూ, సాక్షితో కలిసి ఐస్‌క్రీం తింటూ ధోనీ చాలా కూల్‌గా కనిపించారు. ఈ కార్నివాల్‌లో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గిరగిరా తిరిగే ఒక రైడ్ ఎక్కమని అనంత్ అంబానీ ధోనీని ఆహ్వానించారు. అయితే, దానికి ధోనీ సున్నితంగా నిరాకరించారు. ఆ రైడ్ ఎక్కితే తనకు కళ్లు తిరుగుతాయని సరదాగా సైగలు చేస్తూ వివరించారు. అంబానీ కుటుంబం ఏర్పాటు చేసిన ఈ నవరాత్రి వేడుకల్లో కార్నివాల్ రైడ్స్‌తో పాటు గర్బా, ఇతర కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ధోనీ, అనంత్ అంబానీ కలిసి గడిపిన క్షణాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

102 ఏళ్లలో ఇదే తొలిసారి... దక్షిణాఫ్రికా జట్టులో అరుదైన రికార్డు!

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు 102 ఏళ్ల తర్వాత ఒక చారిత్రక రికార్డును పునరావృతం చేసింది. ఆస్ట్రేలియాతో గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తుది జట్టులో ఏకంగా 8 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే ఉండటం విశేషం. ఇంతకుముందు 1924లో ప్రొటీస్ జట్టులో ఇలాంటి కూర్పు కనిపించింది. శతాబ్ద కాలం తర్వాత మళ్లీ అదే సీన్ రిపీట్ కావడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆదివారం ప్రారంభమైన ఈ టెస్టు మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి రోజు కేవలం 12.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టులో 214 పరుగుల తేడాతో ఓటమిపాలైన దక్షిణాఫ్రికా... రెండో టెస్టు కోసం జట్టులో మూడు మార్పులు చేసింది. 30 ఏళ్ల మార్క్వెస్ అకర్‌మన్‌కు అరంగేట్రం అవకాశం ఇవ్వగా, కగిసో రబడ, మాథ్యూ బ్రీట్జ్కేలను తిరిగి జట్టులోకి తీసుకుంది. ఈ మార్పుల వల్లే తుది జట్టులో 30 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 8కి చేరింది. దక్షిణాఫ్రికా జట్టులో స్పిన్నర్ సైమన్ హార్మర్ (37) అత్యంత పెద్ద వయస్కుడు కాగా, ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ (26) అత్యంత పిన్న వయస్కుడు. మరోవైపు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టులో అయితే తుది జట్టులోని 11 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే కావడం మరో విశేషం. అనుభవానికే పెద్దపీట వేస్తూ ఆసీస్ బరిలోకి దిగింది. ఆ జట్టులో మాట్ రెన్‌షా (30) అత్యంత చిన్నవాడు కాగా, స్టీవ్ స్మిత్, స్కాట్ బోలాండ్ (37) సీనియర్ ఆటగాళ్లుగా ఉన్నారు. మొత్తం మీద ఈ టెస్టులో ఇరు జట్లలో కలిపి 19 మంది ఆటగాళ్లు 30 ఏళ్లకు పైబడిన వారే బరిలోకి దిగారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఇంతమంది సీనియర్ ఆటగాళ్లు ఆడటం ఇది రెండోసారి మాత్రమే. 1926లో ఇంగ్లండ్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లో 20 మంది 30 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు ఆడారు. ఇక ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 20 పరుగులు చేసింది. రెండు వికెట్లనూ స్కాట్ బోలాండ్ పడగొట్టాడు.

రింకూ సింగ్ మళ్లీ మెరిశాడు

రంజీల్లో వరుసగా రెండో సెంచరీ.. సెలక్టర్లకు గట్టి సమాధానం

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ సంచలనం రింకూ సింగ్, తన ప్రదర్శనతో బీసీసీఐ సెలక్టర్ల తలుపును గట్టిగా తడుతున్నాడు. జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ బాది, తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గోవాతో జరుగుతున్న మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేసి అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. నిన్న కాన్పూర్‌లో గోవాతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరప్రదేశ్, కేవలం 33 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు అభిషేక్ గోస్వామి (5), ఆర్యన్ జుయల్ (14), కెప్టెన్ కరణ్ శర్మ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరోవైపు పట్టుదలగా నిలబడి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. తన సహజ శైలికి భిన్నంగా ఓపికగా ఆడి, జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. తన అజేయ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 118 పరుగులు సాధించాడు. అతని పోరాటంతో ఉత్తరప్రదేశ్ జట్టు 71 ఓవర్లలో 202 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఈ సీజన్‌లో బిహార్‌పై కూడా రింకూ (112) శతకం సాధించడం గమనార్హం. ఇటీవలే జింబాబ్వే సిరీస్ తర్వాత రింకూను జాతీయ జట్టు నుంచి తప్పించారు. ఆపై న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో, అతను దేశవాళీ టోర్నీలో వరుస సెంచరీలతో చెలరేగడంతో, సోషల్ మీడియాలో అభిమానులు సెలక్టర్ల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇంత నిలకడగా ఆడుతున్న ఆటగాడిని ఎందుకు విస్మరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే.. గోవా బౌలర్లలో లెగ్ స్పిన్నర్ యశ్ కస్వంకర్ 86 పరుగులిచ్చి 5 వికెట్లతో ఉత్తరప్రదేశ్ పతనాన్ని శాసించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా, తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో శివేంద్ర భుజ్‌బల్ (31 నాటౌట్), సుయాష్ ప్రభుదేశాయ్ (12 నాటౌట్) ఉన్నారు. గోవా ఇంకా 159 పరుగులు వెనుకబడి ఉంది.

తెలంగాణ కోడలిని అంటూ నేషనల్ క్రష్ సగర్వంగా!

పాన్ ఇండియా లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మ-రోసారి వినయంతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలతో బిజీగా ఉండే కథానాయికల్లో ఒకరిగా ఉన్నా? సాంప్రదాయాలకు, స్థానిక సంస్కృతికి రష్మిక ఇచ్చే గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో రష్మిక పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తెలంగాణ మహిళలతో కలసి రష్మిక ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి.. ఆనందానికి గురిచేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య మహిళలతో కలిసి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ వేడుకలను జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఒక స్టార్ హీరోయిన్ ఇలా వీధిలో అందరితో కలిసిపోవడం, స్థానిక పండుగలో పాలుపంచుకోవడం ఆమెలోని ఎంతో సింపుల్ స్వభావాన్ని ఆవిష్కరించింది.

ఈ వేడుకల సందర్భంగా రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. -నేను తెలంగాణ కోడలిని. తెలంగాణ ఇంటి ఆడపడుచునని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను- అని సంతోషంగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు చూపించే ఆప్యాయత, ప్రేమ తనకు ఎంతో ప్రత్యేకమైనవని, ఈ నేలతో తనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంతో వెల్లడించారు. ఈ మాటలు విన్న తెలంగాణ ప్రజలు, అభిమానులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

రష్మిక ఇంత సరళంగా.. సంస్కారవంతంగా ఉండటం చూసి విజయ్ దేవరకొండ నిజంగా ఎంతో లక్కీ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కుటుంబంతో.. ఆయన మూలాలతో రష్మికకు ఉన్న అనుబంధం గురించి ఇండస్ట్రీలో ఎప్పటినుంచో ఆసక్తికరమైన చర్చలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక తెలంగాణ సంస్కృతిని తన సొంత సంస్కృతిగా భావించి ఇంత గౌరవంగా బతుకమ్మ ఆడటం వారి బంధానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టింది.



కొత్త మూవీ.. మహేష్ మారిపోయాడు!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటేనే తక్కువ ప్రమోషన్లు.. సినిమా రిలీజ్ కు ముందు తక్కువ ఇంటర్వ్యూలు, ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ తోనే ఆయన తన మూవీ ప్రమోషన్స్ ను కంప్లీట్ చేస్తారనే పేరుంది. మిగతా హీరోల్లా వరుసగా మీడియా మీట్స్ లో పాల్గొనడం, వేర్వేరు సిటీస్ తిరుగుతూ సినిమాను ప్రమోట్ చేయడం, సోషల్ మీడియాలో సందడి చేయడం పెద్దగా అలవాటు లేదు. కొంతకాలంగా మహేష్ బాబు అలాగే చేస్తున్నారు. కానీ ఇప్పుడు తన కొత్త మూవీ.. దర్శకధీరుడు రాజమౌళితో చేస్తున్న వారణాసి సినిమా కోసం మాత్రం మహేష్ బాబు ఇప్పుడు తన పద్ధతిని మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ ప్రమోషన్లకు పెద్దగా సమయం కేటాయించని ఆయన.. ఈసారి నెలల ముందే ప్రమోషనల్ ఈవెంట్స్ కు రెడీ కావాల్సి వస్తోందట. నిజానికి ఆ సినిమాను వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలనేది మూవీ టీమ్ బిగ్ టార్గెట్. అందుకే ప్రమోషన్స్ కు సంబంధించి ఇప్పటికే స్పెషల్ ప్లాన్ ను మేకర్స్ రెడీ చేసినట్లు సమాచారం. ఏయే నెలల్లో, ఏయే తేదీల్లో అందుబాటులో ఉండాలనే వివరాలతో మహేష్ కు ఓ షెడ్యూల్ అందినట్లు ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. జనవరి 2027 నుంచి ఏప్రిల్ 7వ తేదీ సినిమా విడుదలయ్యే వరకు ఆయన ప్రమోషనల్ ఈవెంట్స్ కోసం కోసం కంప్లీట్ గా టైమ్ కేటాయించాల్సి ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సాధారణంగా సినిమా విడుదలకు కొద్ది రోజుల ముందు మాత్రమే ప్రమోషన్స్ లో కనిపించే మహేష్ బాబు.. ఈసారి దేశంలోని మెయిన్ సిటీస్ తో పాటు ఇంటర్నేషనల్ స్టేజెస్ పై సందడి చేయాల్సి రావచ్చు. ముఖ్యంగా వరల్డ్ వైడ్ గా సినిమాను ప్రేక్షకులకు పరిచయం చేయాలంటే హీరో కూడా ప్రమోషన్స్ లో చురుగ్గా ఉండటం అవసరం. అందుకే తన ఎప్పుడూ ఫాలో ప్రాసెస్ ను పక్కన పెట్టి, ప్రమోషన్స్ కు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వారసుడి సినిమాలో సింహం ఓ మెరుపులా!

యంగ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో నందమూరి వారసుడు మోక్షజ్ఞ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఎంతో మంది దర్శకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా? చివరికి -బింబిసార- ఫేం వశిష్ట వైపు నందమూరి బాలకృష్ణ మొగ్గు చూపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నందమూరి అభిమానుల్లో.. సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మోక్షజ్ఞ తొలి సినిమా కావడంతో ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు వశిష్ట ప్రత్యేక కసరత్తులు చేస్తున్నారు. కథా చర్చల దగ్గరి నుంచి ప్రతీ విషయంలోనూ బాలయ్య స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అయితే మోక్షజ్ఞ లాంచ్ పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో సినిమాలో బాలకృష్ణ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ గెస్ట్ రోల్ కేవలం సినిమాకు ఒక పవర్ ప్యాక్డ్ టేకాఫ్ లాగా మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. సాధారణంగా స్టార్ హీరో వారసుడి లాంచ్ సినిమాలో కనిపిస్తే ఆ క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. అయితే స్క్రీన్ మీద బాలకృష్ణే ఎక్కువ సేపు కనిపిస్తే? అది డెబ్యూ హీరో అయిన మోక్షజ్ఞకు మైనస్‌గా మారుతుందనే జాగ్రత్తను వశిష్ట ముందుగానే ప్లాన్ చేసినట్లు సమాచారం. సీనియర్ హీరో స్థాయికి తగినట్లుగా సినిమా మొత్తం ఉంటే? కొత్త హీరో ఎలివేషన్ తగ్గే ప్రమాదం ఉందని భావించిన దర్శకుడు బాలయ్య పాత్రను కేవలం ఒక మెరుపులా.. సరిగ్గా ఇంట్రడక్షన్ కీలకమైన టేకాఫ్ సన్నివేశాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారట. ఈ గెస్ట్ రోల్ ద్వారా సినిమాకు కావాల్సినంత హైప్ రావడం ఖాయమని.. అదే సమయంలో మోక్షజ్ఞకు పూర్తి స్థాయి హీరోగా ప్రతిభను ప్రదర్శించడానికి తగినంత స్పేస్ దొరుకుతుందని తెలుస్తోంది. నందమూరి అభిమానుల అంచనాలను నిలబెడుతూనే మోక్షజ్ఞ సోలో హీరోగా టాలెంట్‌ను నిరూపించుకోవడానికి ఈ ప్లానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారుట.

స్టన్నింగ్ లుక్ లో దివి హొయలు..

ప్రముఖ బ్యూటీ దివి గురించి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్న ఈమె.. సినిమాల కంటే కూడా బిగ్ బాస్ తెలుగు సీజన్ 4 లో కంటెస్టెంట్గా పాల్గొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. అప్పటినుంచి పలు చిత్రాలలో కీలక పాత్రలు పోషిస్తూనే.. మరోకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఒలకబోస్తున్న ఈ చిన్నది తాజాగా షేర్ చేసిన మరో ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. స్టన్నింగ్ లుక్ లో ఆమె ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఒకసారి సాంప్రదాయంగా కనిపిస్తూ.. అందర్నీ ఆకట్టుకుంటుంది. మరోకసారి గ్లామర్ వలకబోస్తూ కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తూ ఉంటుంది. ఇలా తాజాగా మరోసారి మరో ఔట్ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది ఈ చిన్నది . చూపు తిప్పుకోలేని అందంతో స్టన్నింగ్ లుక్ లో శరీరానికి అతుక్కుపోయేలా దుస్తులు ధరించి చిల్ అవుతూ పార్టీ వైబ్ ను తెగ ఎంజాయ్ చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా దివి ధరించిన దుస్తుల విషయానికి వస్తే.. బ్లాక్ కలర్ సింగిల్ సైడ్ షోల్డర్ బాడీ కాన్ డ్రెస్ ధరించిన ఈమె ఒకవైపు బాటమ్ చీలిక లాంటి డ్రెస్ ధరించి తన ఫ్యాషన్ సెన్స్ ను చూపించుకుంది . వన్ షోల్డర్ డిజైన్ ఈమె లుక్ కి అదనపు హుందాతనాన్ని అందించింది. ముఖ్యంగా ఈమె రూపానికి అధునాతనమైన గ్లామర్ ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ ట్రెండీ అవుట్ ఫిట్ సెలబ్రిటీ ఫ్యాషన్ లుక్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ట్రెండీ అవుట్ ఫిట్ ధరించడమే కాకుండా దానికి తగ్గట్టు అసలైన ఆత్మవిశ్వాసాన్ని చూపిస్తూ తిరుగులేని స్టార్ పవర్ ను నిరూపించింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికి అయితే ఈ లేటెస్ట్ బ్లాక్ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District